‘ఎగ్’నామం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కింద వారంలో ఐదు రోజుల పాటు కోడిగుడ్లు ఇచ్చేవారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక మధ్యాహ్న భోజన పథకం పేరు మార్చ రేగానీ మెనూ అలాగే ఉంచారు. అయితే జిల్లాలో చాలా చోట్ల విద్యార్థులకు మెనూలో కోడిగుడ్డు మాయమైంది. కొన్ని చోట్ల ఏజెన్సీల నుంచి గుడ్లు సరఫరా లేకపోవడం, మరికొన్ని చోట్ల సైజ్ చాలా చిన్నవిగా ఉండటంతో పంపిణీ చేయడం లేదు.



రాగి జావ మాయం



పాఠశాలలు తెరిచి నెలన్నర అవుతోంది. కొత్త ప్రభుత్వం సర్కారు పాఠశాలపై శీతకన్ను వేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద విద్యార్థులు రక్తహీనతతో అనేక రకాల రుగ్మతలకు లోనై విద్యపై దృష్టి పెట్టలేక పోతున్నారని పౌష్టికాహారం పంపిణీకి చర్యలు తీసుకుంది. వారానికి మూడు రోజులు చెక్కీలు ఇవ్వడతో పాటు బెల్లం, రాగి పిండితో తయారు చేసే రాగిజావను ఇవ్వడం ద్వారా అనేక మంది ఐరన్, కాల్షియం లోపాలను అధిగమించారు. అయితే టీడీపీ ప్రభుత్వం నుంచి వచ్చిన తర్వాత పాఠశాలలో రాగి జావను మాయం చేసింది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని నిలిపివేయడం తగదని విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ బడి కళ తప్పింది.. అరకొర విద్యా కానుకలు.. రుచీశుచీ లేని మధ్యాహ్న భోజనం.. ఏకోపాధ్యాయ బోధనలు.. తూతూ మంత్రంగా సాగుతున్న నాడు– నేడు పనులు వెరసి చదువులకు ‘చంద్ర’ గ్రహణం పట్టింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనా ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కారం కాలేదు. అదనపు తరగతి గదుల నిర్మాణం ఆగిపోయింది. మౌలిక సదుపాయాల కల్పన ఊసే లేదు. పరిశుభ్రత మాట దేవుడెరుగు.. విద్యార్థులకు కనీసం మంచినీరు కూడా అందని దుస్థితి నెలకొంది. కానుక ‘కినుక’ వహించగా.. అత్యాధునిక బోధన పరికరాలను వినియోగించుకోలేని దౌర్భాగ్యం.. గత ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇవ్వగా ప్రస్తుత ప్రభుత్వం గాలికొదిలేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చంద్రం మాస్టారు చతికిలబడి



- ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోని టీడీపీ కూటమి ప్రభుత్వం
- అస్తవ్యస్తంగా మధ్యాహ్న భోజన పథకం అమలు
- విద్యార్థులకు అందని పాఠ్య పుస్తకాలు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం
- దారుణంగా పడిపోయిన అడ్మిషన్లు

ప్రభుత్వ పాఠశాలలు	ప్రైవేటు పాఠశాలలు	ఎయిడెడ్ పాఠశాలలు	మొత్తం పాఠశాలలు
1378	596	50	2024

మొత్తం విద్యార్థుల సంఖ్య 1,57,922

నంద్యాల: కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నుతూ అందంగా రూపుదిద్దుకున్న ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేందుకు ఒకప్పుడు విద్యార్థులు ఉత్సాహం చూపేవారు. అక్కడి వసతులను చూసి తల్లిదండ్రులు మురిసిపోయేవారు. తమ పిల్లలను అందులో చేర్పించాలని పోటీపడేవారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సైతం బాధ్యతగా పనిచేసేవారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లో పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అధ్వానంగా మారింది. మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ కరువైంది. ఉపాధ్యాయుల సర్దుబాటు అటకెక్కి.. బోధన అస్తవ్యస్తంగా మారింది. చాలా పాఠశాలలకు ఒక్కరే టీచర్లు ఉన్నారు. ఆ ఉపాధ్యాయుడు సెలవు పెడితే విద్యార్థులు ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. చెప్పేవారు లేక, చదివేది అర్థం కాక నిరుపేద విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. గిరిజన తండాలు, మారుమూల గ్రామాల్లో ప్రాథమిక విద్య పరిస్థితి దారుణంగా ఉంది. గతంలో పాఠశాల ప్రారంభంలోనే పాఠ్యపుస్తకాలు అందేవి. ప్రస్తుతం తరగతులు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా చాలా చోట్ల వాటి ఊసే కరువైంది. విద్యా కానుక కిట్ల పంపిణీ అరకొరగా సాగింది. పెన్ను, పెన్సిల్, నోట్ పుస్తకాలు లేక కొత్తగా చేరిన విద్యార్థుల చదువు ముందుకు సాగడం లేదు. చాలా పాఠశాలల్లో తరగతి గదులు పూర్తికాలేదు. అరకొర సౌకర్యాల మధ్యే విద్యార్థులు పాఠ్యాంశాలు వినాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపించింది. విద్యార్థులకు గుడ్డు అందడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుద్యానికి ప్రాధాన్యత ఇచ్చింది. మరుగుదొడ్ల నిర్వహణపై శ్రద్ధ చూపింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం శుభ్రతకు మంగళం పాడింది. విద్యార్థుల ఆరోగ్యానికి పొగబెడుతోందన్న విమర్శలు ఉన్నాయి.



ప్రశ్నార్థకంగా ఇంటర్ విద్య

దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ కళాశాల బోర్డు

జిల్లాలో 28 మండలాలు ఉండగా.. 16 మండలాల్లో మాత్రమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మిగిలిన మండలాలకు చెందిన బాలికలు పట్టణాల్లోని కళాశాలకు వెళ్లలేక చదువులు మానుకుంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాల స్థాయిలోనే ఇంటర్మీడియట్ కోర్సులను ప్రవేశ పెట్టాలని నిర్ణయం తీసుకుంది. తొలుత జిల్లాకు ఒక హైస్కూల్‌ను ఎంపిక చేసి ‘హైస్కూల్ ప్లస్’ పేరుతో రెండేళ్ల క్రితం ఇంటర్మీడియట్ కోర్సులను ప్రారంభించింది. మంచి ఫలితాలు రావడంతో ఈ విధానాన్ని మరింత విస్తరించాలని ఈ విద్యాసంవత్సరం ఐదు మండలాల్లోని ఐదు ఉన్నత పాఠశాలలను ‘హైస్కూల్ ప్లస్’గా అప్‌గ్రేడ్ చేశారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ‘హైస్కూల్ ప్లస్’గా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో ఇంటర్ విద్య ప్రశ్నార్థకంగా మారింది. రెండు నెలలు గడచినా ఒక్క అడ్మిషన్ కూడా లేదు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో హైస్కూళ్లలో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేసినా వెలవెలబోతున్నాయి.



బోధన..వేదన

దొర్నిపాడు మండలం శాంతినగరం ఏకోపాధ్యాయ పాఠశాలలో టీచర్ సెలవులో వెళ్లడంతో పక్క గ్రామం నుంచి వచ్చిన ఉపాధ్యాయుడు

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ తీరు అధ్వానంగా ఉంది. మౌలిక వసతుల సంగతెలా ఉన్నా.. భావి భారత పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థులకు కనీసం అక్షరజ్ఞానం నేర్పాల్సిన ఉపాధ్యాయులే కరువయ్యారు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,378 ఉండగా.. వీటిలో 154 పైగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఏకోపాధ్యాయులే నెట్టుకొస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేసింది. ప్రస్తుతం వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పాఠశాలలపై ప్రత్యేకంగా దృష్టి సారించలేదు. దీంతో ఒకే సారి ఐదు తరగతులకు చెందిన అన్ని సబ్జెక్టులు విద్యార్థులకు బోధించడం కత్తిమీద సామవుతోంది. ఏదైనా అవసరమొచ్చి ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆరోజు బడి బంద్ కావాల్సిందే. లేదంటే సమీప ఊరులోని బడిలో నుంచి అప్పటికప్పుడు తాత్కాలిక ఉపాధ్యాయుడు వచ్చినా.. ఏమీ చెప్పలేని పరిస్థితి ఎదురవుతోంది.

ఆయాగా నన్ను తొలగించారు



నేను గోపరం జెడ్పీ పాఠశాలలో నాలుగేళ్లగా ఆయాగా పని చేశాను. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నన్ను ఆయాగా తొలగించారు. మా నాన్న కోలా శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీకి పనిచేశాడని నన్ను తీసేశారు. నాకు నాలుగు నెలల జీతం రావాల్సి ఉంది. ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడం సరికాదు. – లక్ష్మీదేవి, గోపవరం, మహానంది మండలం

5 తరగతులకు ఒక్కరే



మా ఊర్లో 5 తరగతులకు ఒక్కరే టీచర్ ఉన్నారు. పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉన్నారు. అందరినీ ఒకే చోట కూర్చోబెట్టి చదువు చెబుతున్నారు. ఇలా ఉంటే భవిష్యత్తులో ఉన్నత చదువులకు వెళితే విద్యార్థులు ఏమి ప్రతిభ చూపుతారు. పోటీ ప్రపంచంలో చదువుతోనే జీవితం ముడిపడి ఉంది. ఇంతగా చదువుకు ప్రాధాన్యత ఉన్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరం. – మౌలాలి, విద్యార్థి, శ్రీరాంనగర్, గోస్పాడు

ఎవ్వరు లేరని చేరలేదు



నేను దొర్నిపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోనే పదో తరగతి పాస్ అయ్యాను. ఇక్కడే ఇంటర్మీడియట్ చదవచ్చని అమ్మనాన్నలు కూడా చెప్పారు. కానీ ఎవ్వరు చేరకపోవడంతో శ్రీశైలంలోని రెసిడెన్షియల్లో చేరారు. కళాశాల వచ్చిందని, మాదే ఫస్ట్‌బ్యాచ్ అని సంబర పడ్డాం. ఇంటర్ వచ్చినా ఫలితం లేకపోయింది. – యశ్వంత్, దొర్నిపాడు

రాగిజావ రోజూ ఇవ్వాలి



గత ఏడాది మా పాఠశాలలో ప్రతి రోజూ రాగిజావ ఇచ్చేవారు. ప్రస్తుతం ఇవ్వడం లేదు. రాగిజావ ఇస్తే బాగుంటుంది. చిక్కీలు కూడా అప్పుడు ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి గతంలో ఇచ్చిన మాదిరిగానే ఇప్పుడు కూడా పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ, చిక్కీలు ఇవ్వాలి. – లహరి, 8వ తరగతి విద్యార్థిని, జిల్లా పరిషత్ హైస్కూల్, చాపిరేవుల, నంద్యాల

అప్పటి వైభవం ఏదీ?



మూతపడ్డ బ్రాహ్మణపల్లె ఎలిమెంటరీ పాఠశాల

ప్రభుత్వ పాఠశాలలో గతంలో అడ్మిషన్లకు తల్లిదండ్రులు క్యూ కట్టేవారు. కొన్ని పాఠశాలల్లో సీట్లన్నీ అయిపోయాయని బోర్డులు సైతం పెట్టేవారు. సీట్ల కోసం ప్రజాప్రతినిధులు, మంత్రుల చేత సిఫార్సులు చేయించేవారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో వసతులపై వివరించేవారు. నాణ్యమైన బోధన అందుతుందని, మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పేవారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తోంది. ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి సారించలేదు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ప్రభుత్వ బడుల్లో చేరికలు పూర్తిగా తగ్గిపోయాయి. విద్యార్థులు లేకపోవడంతో కొన్ని పాఠశాలలు మూత పడుతున్నాయి.

మధ్యాహ్న భోజనంలో రాజకీయ కుంపటి



చాపిరేవుల ప్రాథమిక పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అంతటా రాజకీయ జోక్యానికి ప్రాధాన్యత ఇస్తుందనే పాఠశాలలో వంట ఏజెన్సీల మార్పులు చేయడమే నిదర్శనం. జిల్లాలో 1,378 పాఠశాలలు ఉండగా ఇప్పటికే 207 వంట ఏజెన్సీలను మార్చేసింది. పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని శుచి, రుచిగా వడ్డించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం నిర్వహణ ఖర్చులు పెంచడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులకు మంచిరోజులు వచ్చాయి. గుడ్లు మినహా పప్పు, నూనె, కూరగాయలు, ఆకు కూరలు మిగతా వస్తువులు అన్నీ నిర్వాహకులే తాజాగా కొనుగోలు చేసుకునే వెసలుబాటును ఏజెన్సీ నిర్వాహకులకే కల్పించింది. వంట సహాయకులకు గౌరవ వేతనం రూ. 3000కు పెంచింది. కాగా తాజాగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం జిల్లాలో అన్ని పాఠశాలల్లో వంట ఏజెన్సీలను మార్పు చేసింది. రాజకీయ ప్రవేశంతో పిల్లలకు ఏజెన్సీలు వండిందే పరమాన్నంగా మారింది. మెనూ కూడా తూతూమంత్రంగా పాటిస్తున్నారు. కొత్త మోజుతో కొందరు బాగానే వంటకాలు చేస్తున్నారు. అలవాటు పడిన పాత ఏజెన్సీలు వంటకాల్లో మార్పు సరిగ్గా లేకపోయింది.

అటకెక్కిన సాంకేతిక పాఠం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్కారు బడుల్లో వెలిగిన డిజిటల్ కాంతులు ఆరిపోతున్నాయి. టీడీపీ ప్రభుత్వం పర్యవేక్షణ లేకపోవడంతో కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ అలంకార ప్రాయంగా మారుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండు విడతలుగా 1,323 పాఠశాలలకు 3,498 ఐఎఫ్‌పీ ప్యానళ్లను మంజూరు చేసింది. ఇంటర్‌నెట్‌ను ఉపయోగించుకొని కంప్యూటర్‌లా వాడుకోవడమే కాకుండా యూట్యూబ్, ఫోన్, ట్యాబ్లలోని సమాచారాన్ని సైతం స్క్రీన్‌పై చూసేందుకు అవకాశం కల్పించింది. పాఠశాల స్థాయి నుంచే పేద వర్గాల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంది. అయితే టీడీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు వాటి వినియోగంపై సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు వాటిని వాడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రోత్సాహం లేని చదువులు



గతేడాది పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

ప్రభుత్వ బడులో ప్రతిభా విద్యార్థులను ప్రోత్సహించి మిగిలిన విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు గత ప్రభుత్వం పదో తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ‘ఆణి ముత్యాలు’ పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ వివిధ గ్రూపులు చదివిన విద్యార్థుల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి రూ.లక్ష నగదు ప్రోత్సాహకం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.50వేలతో పాటు సర్టిఫికెట్, మెడల్స్ ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు. విజేతలకు నగదు ప్రోత్సాహకాలు కేవలం రాష్ట్ర స్థాయికే పరిమితం చేయకుండా నియోజకవర్గ, జిల్లా స్థాయికి వర్తింపజేశారు. కాగా టీడీపీ ప్రభుత్వంపై ప్రతిభా పురస్కారాలపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో నగదు ప్రోత్సాహకాలు ఇస్తారా? లేదా? అన్న సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది.

‘కొత్త’ కానుక ఏదీ



గతేడాది విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గత ప్రభుత్వం సిద్ధం చేసిన విద్యాకానుకను టీడీపీ ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే 2024–25 విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థులకు కానుక ఇవ్వడంలో మొండి చేయి చూపింది. జిల్లాలో మొత్తం 1,378 పాఠశాలల్లో 1,29,753 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు కిట్లు పంపిణీ కాలేదు. కిట్లు అందని వారు 5 వేలకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. పాఠశాలలు ప్రారంభమై నెలన్నర దాటినా కొత్తగా పంపిన ప్రతిపాదనలకు ఇప్పటికీ మోక్షం లేదు. దీంతో చాలా మంది విద్యార్థులు పాత దుస్తులు, సివిల్ డ్రస్‌ల్లో పాఠశాలలకు వస్తున్నారు. పలు చోట్ల యూనిఫాం పంపిణీ సాగలేదు. అలాగే ఇంటర్ విద్యార్థులకు టెస్ట్ బుక్స్ పంపిణీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చారు. కళాశాలలు తెరిచి రెండు నెలలు అయినా ఆ ఊసే లేకపోవడంతో విద్యార్థులు పుస్తకాలు బయట కొనలా వద్దా అనే ఆందోళనలో ఉన్నారు.

బడిలో శుభ్రతకు మంగళం



ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు

గత ప్రభుత్వం మౌలిక వసతులు మధ్య విద్యార్థులు చదువులు కొనసాగించేలా చర్యలు తీసుకుంది. ముఖ్యంగా టాయిలెట్ల నిర్వహణపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పాఠశాలల పరిసరాల పరిశుభ్రతతో పాటు మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు ఆయాలను నియమించింది. 300 మంది విద్యార్థుల వరకు ఒకరు, 600 విద్యార్థులుంటే ఇద్దరు, 900 మంది ఉంటే ముగ్గురు, 900 మందికి పైగా ఉంటే నలుగురు ఆయాలను నియమించింది. ఈ విధంగా జిల్లాలో 1,489 మంది ఆయాలను నియమించారు. వీరికి నెలకు రూ.6వేలు గౌరవ వేతనం అందజేశారు. అయితే ఆయాల కొనసాగింపులో ఎలాంటి స్పష్టత రాకపోవడంతో పాటు వేతనాలు కూడా ఇవ్వలేదు. అలాగే పర్యవేక్షణ ఉండేలా మరుగుదొడ్లు శుభ్రంగా ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయించేది. కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ పర్యవేక్షణకు మంగళం పాడుతూ తాజాగా ఇటీవల ఆదేశాలు ఇచ్చింది. దీంతో మరుగుదొడ్ల శుభ్రత మరుగన పడే అవకాశం ఉంది.

జగనన్న తెచ్చిన చదువుల విప్లవం

జగనన్న పాలనలో విద్యార్థుల లబ్ధి ఇలా..

పథకం పేరు	విద్యార్థుల సంఖ్య	లబ్ధి(రూ.లలో)
అమ్మ ఒడి	1,67,084	రూ.817.20 కోట్లు
విద్యాదీవెన	1,63,688	రూ.153.22 కోట్లు
వసతి దీవెన	1,09,825	రూ.345.28 కోట్లు



- 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 20,730, 2023–24 విద్యాసంవత్సరానికి 20,913 మందికి ట్యాబ్‌లను అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంపిణీ చేసింది. దూర దృష్టితో ఆలోచించి ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడకుండా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులకు, వారికి బోధించే ఉపాధ్యాయులకు అందజేశారు.
- ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారా? లేదా? అన్న అంశాలపై నిరంతరం పర్యవేక్షించేందుకు ఇద్దరు ఎంఈఓల విధానానిన చేపట్టింది. ఇందుకుగాను ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈవో (మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్) లను నియమించింది. నంద్యాల జిల్లాలో మొదట మండలానికి ఒకరు చొప్పున 20 మంది ఉంటే తాజాగా ఎంఈఓ 2 తో మరో 29 మందిని నియమించారు.
- చాక్ పీసులతో బ్లాక్‌బోర్డు, గ్రీన్‌బోర్డులపై పాఠాలు బోధించే స్థాయి నుంచి మారుతున్న సాంకేతిక పరిజ్ఞానికి మార్పు చెంది ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌పై పాఠశాలు బోధించే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయి.

ఐదేళ్ల జగనన్న పరిపాలనలో విద్యా సంస్కరణలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నాడు–నేడుతో పాఠశాలలకు కొత్త భవనాలు, తరగతి గదులు, అదనపు తరగతి గదులు, ప్రహరీ, డిజిటల్ బోర్డులు, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యం, బాలబాలికలకు టాయిలెట్లు తదితర వాటిని నిర్మించారు. జిల్లాలో మొదటి దశలో 486 ప్రభుత్వ పాఠశాలలను అత్యంత సుందరంగా ఆధునీకీకరించి వాటికి కావలసిన సదుపాయాలను కల్పించడం జరిగింది. ప్రస్తుతం రెండవ దశలో రూ.366 కోట్ల ఖర్చుతో 983 ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునీకరణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి.

జిల్లాలో మొదటి విడతలో 461 పాఠశాలల్లో 1,634, రెండో విడతలో 862 పాఠశాలల్లో 1,864 ఐఎఫ్‌పీ ప్యానళ్లనుఏర్పాటు చేశారు.



- డిజిటల్ విద్యాబోధన మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ‘స్విఫ్ట్ చాట్‌బాట్’ పేరుతో ఓ యాప్‌ను అనుసంధానం చేస్తూ పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఈ యాప్ విద్యా బోధనలో సహాయకారిగా ఉండేలా రూపొందించారు. నంద్యాల జిల్లాలో 3 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి స్మార్ట్‌ఫోన్లలో ఈ స్విఫ్ట్ చాట్‌బాట్‌ను తప్పని సరిగా ఇన్‌స్టాల్ చేసుకునేలా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంది.
- కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బోధించే సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రభుత్వ బడుల్లో బోధించేందుకు చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చింది. జిల్లాలో 69 పాఠశాలలను తొలివిడతగా ఎంపిక చేశారు. బడుల్లో బట్టీ విధానానికి, మూసపద్ధతికి స్వస్తి పలికి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సిలబస్‌ను అమలు చేయనున్నారు. దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గోస్పాడులో గణితం, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు శిక్షణ పూర్తిచేశారు.

అమ్మఒడి ఏటా ఇచ్చారు



మా కుమార్తె అక్షయ స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 10వ తరగతి చదువుతోంది. ఐదో తరగతిలో ఉన్నప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మ ఒడిని అమలు చేస్తోంది. వరుసగా నాలుగేళ్లు అందుకున్నాం. మొదటి విడతలో రూ.15 వేలు, మిగిలిన విడతల్లో రూ.13 వేలు చొప్పున అందాయి. ఎనిమిదవ తరగతిలో ఉన్నప్పుడు ట్యాబ్ కూడా ఇచ్చింది. విద్యా కానుక ఇంద అన్నీ ఇచ్చారు. ఎటువంటి సమస్యల లేకుండా చదువులు కొనసాగాయి. గత ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేసింది. నాడు –నేడుతో పాఠశాలను ఎంతో అభివృద్ధి చేసింది.

– రామాంజనేయులు, కొలిమిగుండ్ల

సీతారామపురం.. శ్మశాన నిశ్శబ్దం

- భయం గుప్పిట్లో గ్రామ ప్రజలు
- హత్య నేపథ్యంలో బిక్కుబిక్కుమంటూ జీవనం
- రక్షణ లేదంటూ సొంతూరు వీడుతామంటున్న బాధితులు
- గ్రామంలో భారీగా పోలీసుల మోహరింపు


నిర్మానుష్యంగా కనిపిస్తున్న గ్రామం


గ్రామంలో మోహరించిన పోలీసులు

సాక్షి, నంద్యాల: హత్యాకాండ నుంచి సీతారామాపురం ఇంకా తేరుకోలేదు. ఊరిలో ఏ వీధి చూసినా నిర్మానుష్యంగా కనిపిస్తోంది. నిశ్శబ్ద వాతావరణం నెలకొని ఊరిలో జనాలు ఉన్నారా లేరా అనే అనుమానం కలుగుతోంది. హత్య నేపథ్యంలో గ్రామ ప్రజలు ఇంట్లో నుంచి అడుగు బయట పెట్టడం లేదు. టీడీపీ మూకలు అరాచకానికి పాల్పడి, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లపై దాడులకు పాల్పడిన ఘటనలు ఇంకా తమ కళ్లముందే కనిపిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రశాంతమైన గ్రామంలో బుడ్డా శ్రీనివాసరెడ్డి అరాచకం సృష్టించాడని ఆవేదనతో చెబుతున్నారు. ఊర్లో ప్రతి ఇంట్లోనూ శ్రీనివాసరెడ్డి బాధితులం ఉన్నామని, అతని నేర చరిత్ర చూసి తాము ఎప్పుడూ నోరు మెదపలేదని కన్నీటి పర్యంతమవుతూ చెబుతున్నారు. గ్రామంలో సుమారు 850 కుటుంబాలు ఉన్నాయి. 1,800 మంది వరకు జనాభా ఉంది. వీరికి 2,100 ఎకరాల పొలం ఉంది. అందరూ వ్యవసాయం చేసుకుంటూ బతుకుబండిని లాగిస్తున్నారు. కూలీ నాలీ చేసుకుంటూ ఉన్నంతలో పిల్లలను చదివించుకుంటున్నారు. ఒక్కసారిగా టీడీపీ గుండాలు అరాచకం సృష్టించడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు వణికిపోతున్నారు. రాజకీయ పలుకుబడి ఉపయోగించుకుని ఈ కేసు నుంచి శ్రీనివాసరెడ్డి త్వరగానే బయటికి వస్తాడని, అతనికి వ్యతిరేకంగా మాట్లాడినట్లు తెలిసినా సుబ్బరాయుడును చంపేసినట్లే తమను చంపేస్తాడని గ్రామస్తులు వణికిపోతూ చెబుతున్నారు. తాము ఈ మాటలు చెప్పినట్లు ఎక్కడా చెప్పొద్దంటూ ప్రాధేయపడ్డారు.

భారీగా పోలీసుల మోహరింపు

హత్య ఘటన నేపథ్యంలో గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు వంద మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు సీఐలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. బయటి నుంచి ఏ ఒక్కరిని గ్రామంలోని అనుమతించడం లేదు. ఎవరూ వచ్చినా వెనక్కి పంపిస్తున్నారు. సుబ్బరాయుడును హత్య చేసిన శ్రీనివాసరెడ్డిని ఇప్పటి వరకు పట్టుకోకపోవడంతో బాధితులు భయపడుతున్నారు. గ్రామంలోకి వచ్చి తమను కూడా చంపేస్తారేమోనని భయాందోళనకు గురవుతున్నారు.

అంత్యక్రియలకు ఎవరూ రాలేదు

నా భర్తనుదారుణంగా చంపేశాడు. శ్రీనివాసరెడ్డి భయంతోనే అంత్యక్రియలకు కూడా ఎవరూ రాలేదు. మమ్మల్ని పలకరించేందుకు జనాలు భయపడుతున్నారు. శ్రీనివాసరెడ్డి చంపేస్తున్నా నా భర్త కేకలు కూడా వేయలేదు. ఆ కేకలు విని కుమారులు బయటికి వస్తే వారిని కూడా చంపేస్తారని ఆలోచించాడు. 20 నిమిషాల పాటు ఇష్టమొచ్చినట్లు కొట్టారు. రాళ్లు తల మీద వేశారు. ఇనుప కడ్డీలతో చావబాదారు. అడ్డుకోబోయిన నన్ను కూడా కొట్టారు. నా ఎడమ చేతికి 9 కుట్లు పడ్డాయి. వీటిని అంతా చూస్తుంటే ఊర్లో ఉండాలంటే భయమేస్తుంది. ప్రభుత్వం నుంచి కూడా మాకు ఇంతవరకు ఎలాంటి భరోసా దక్కలేదు.

– పసుపులేటి బాలసుబ్బమ్మ

ఊరు వదిలి వెళ్లిపోతాం

శనివారం రాత్రి టీడీపీ గుండాలు చేసిన అరాచకం చూస్తే ఇప్పటికీ వణుకు పుడుతోంది. అత్యంత పాశవికంగా మా మామను చంపేశారు. 30 మందికి పైగా వ్యక్తులు కర్రలు, రాళ్లు, ఇనుప కడ్డీలతో కేకలు వేస్తూ గ్రామంలో హల్‌చల్ చేశారు. సుమారు రెండు గంటల పాటు వాళ్లంతా గ్రామంలో స్వైర విహారం చేసినా గ్రామస్తులు ఎవరూ బయటికి రాలేదు. మా మామను రాళ్లతో కర్రలతో కొట్టి చంపుతున్నా ఎవరూ తలుపులు తీయలేదు. ఉదయం వరకు ఏ ఒక్కరూ బయట అడుగుపెట్టలేదు. ఇవన్నీ చూస్తుంటే మాకు భయమేస్తోంది. కార్యక్రమాలు అయిపోయాక ఊర్లో ఉండాలా లేదా అని నిర్ణయం తీసుకుంటాం.

– పసుపులేటి కుమారి, సుబ్బరాయుడు కోడలు

ఎదురు తిరిగితే రేప్ కేసు పెట్టారు

మా భూమిని అక్రమంగా కబ్జా చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే నీకు దిక్కున్న చోట చెప్పుకో.. ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరించారు. నేను భయపడకుండా ఎదురు తిరిగా. దీంతో గ్రామంలోని ఓ యువతిని అత్యాచారం చేసినట్లు తప్పుడు కేసు పెట్టించాడు. 2021 జూన్ నుంచి ఆ కేసు విచారణ జరుగుతోంది. పోలీసులు కూడా శ్రీనివాసరెడ్డి చెప్పినట్లే నడుచుకున్నారు. వీళ్లు పెట్టిన కేసును చూసి న్యాయమూర్తి కనీసం రిమాండ్ కూడా విధించలేదు. అలాంటి తప్పుడు కేసు పెట్టి మూడేళ్లుగా తీవ్రంగా వేధిస్తున్నాడు. శ్రీనివాసరెడ్డి దౌర్జన్యాలపై విచారించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

– పల్లం నాగరాజు, సీతారామపురం

గ్రామంలో ఉండింటే నన్నూ.. చంపేవారు

శనివారం రాత్రి నేను గ్రామంలో లేకపోవడంతో బతికిపోయా. శ్రీనివాస్‌రెడ్డితో పాటు సుమారు 30 మంది ఫుల్‌గా మద్యం సేవించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆ సమయంలో నేను గ్రామంలో లేను. ఉండి ఉంటే నా మీద కూడా దాడి చేసేవారు. మాకున్న ఒక ఎకరా పొలాన్ని ఆక్రమించుకున్నాడు. దీన్ని ప్రశ్నించినందుకు మాపై కక్ష పెంచుకున్నాడు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వైపే గ్రామస్తులు ఉండడాన్ని శ్రీనివాసరెడ్డి ఓర్చలేకపోయారు. దీంతోనే గ్రామంలో అలజడులు సృష్టించి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. పోలీసులు అందరికీ రక్షణ కల్పించాలి

– శేఖర్, సీతారామపురం

క్లుప్తంగా

వడ్డీ వ్యాపారి ఇంటి ఎదుట ఆందోళన


పురుగుల మందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న రంగన్న కుటుంబ సభ్యులు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని గాంధీనగర్‌లో వడ్డీ వ్యాపారి ఇంటి ఎదుట సోమవారం ఇద్దరు మహిళలు పురుగు మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. వివరాలు.. పట్టణానికి చెందిన రంగన్న డబ్బు అవసరం ఉండటంతో వ్యాపారిని అడిగారు. మీ దగ్గర ఉన్న 30 సెంట్లు స్థలం రిజిస్ట్రేషన్ చేయిస్తే రూ. 30 లక్షలు ఇస్తానని చెప్పటంతో రంగన్న తన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే డబ్బు ఇవ్వకుండా వడ్డీ వ్యాపారి సతాయిస్తుండటంతో రంగన్న కుటుంబంలోని ఇద్దరు మహిళలు సోమవారం వడ్డీ వ్యాపారి ఇంటి వద్దకు వచ్చారు. పురుగు మందు డబ్బాలతో ఆందోళన చేశారు. న్యాయం జరగకపోతే ఇక్కడే పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. వడ్డీ వ్యాపారి ఇంట్లో లేకపోవటంతో మళ్లీ వస్తామని, ఇక్కడే టెంట్ వేసుకొని కూర్చుంటామని రంగన్న కుటుంబ సభ్యులు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు


బాలుడి గాయం చూపిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని వెంకన్నబావి వద్ద సోమవారం పిచ్చికుక్క స్వైర్య విహారం చేసింది. బాలుడు ఖాజాను కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మునిసిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థి ఖాజా ఇంటర్వెల్ టైంలో బయటికి రావడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలోనే ఉర్దూ, తెలుగు, మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లు ఉన్నాయని, ఈ ప్రాంతంలోకి శానిటేషన్ లారీలు వస్తుండటంతో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు స్పందించాలని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆస్తి కోసం గొడవ.. తండ్రి మృతి


మృతి చెందిన తిక్కయ్య

కోసిగి: ఆస్తి కోసం జరిగిన గొడవలో తండ్రి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని జుమ్మాలదిన్నె గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోసిగి తిక్కయ్య, పెద్దకుమారుడు రాముడు మధ్య మూడు సెంట్ల స్థలం విషయంలో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో తండ్రిని కుమారుడు చేతితో గట్టిగా నెట్టివేశాడు. కింద పడిన తిక్కయ్య(65) తలకు బండరాయి తగిలి తీవ్రమైన గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతిని భార్య సిద్ధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కోసిగి ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలి


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్

బొమ్మలసత్రం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదులకు పోలీస్ అధికారులు సత్వరమే పరిష్కారం చూపాలని అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఫిర్యాదుదారుల నుంచి 105 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి తమకు ఫిర్యాదులు అందాయని వాటిలో కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపామన్నారు. మరి కొన్ని ఫిర్యాదులు ఆయా స్టేషన్ అధికారులకు బదిలీ చేయటం జరిగిందన్నారు.

సెప్టెంబర్ 1 నుంచి 21వ పశుగణన

కర్నూలు(అగ్రికల్చర్): 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు కొనసాగనుంది. 6, 7, 8 తేదీల్లో ఆదోని డివిజన్.. 8, 9 తేదీల్లో కర్నూలు డివిజన్‌లకు చెందిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణనిస్తారు. ప్రతి 2వేల ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్ ఉంటారు. ఇలా దాదాపు 200 మంది ఎన్యూమరేటర్లు పశుగణనలో పాల్గొననున్నారు. పారా సిబ్బంది, ఏహెచ్‌ఏలు, గోపాలమిత్రలు ఎన్యుమరేటర్లుగా ఉంటారు. ప్రతి ఐదుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజరు ఉంటారు. సూపర్‌వైజర్లుగా వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు, అసిస్టెంటు డైరెక్టర్లు వ్యవహరిస్తారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో 10 ఇళ్లకు వెళ్లి పశువుల గణనపై ప్రాక్టికల్‌గా శిక్షణనిస్తారు. మొబైల్ యాప్‌లోనే పశుగణన వివరాలు నమోదు చేయనున్నారు.



నీరు పారింది.. కష్టం తీరింది!

సాక్షి ఎఫెక్ట్

గార్గేయపురం–బ్రాహ్మణకొట్కూరు మధ్యలో హంద్రీ–నీవా కాలువను టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సంస్థ పూడ్చి వేసి రాయలసీమకు నీళ్లు అందడంలో జాప్యం జరిగేలా చేసింది. దీనిపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించడంతో ప్రభుత్వం స్పందించి అప్రోచ్ రోడ్డు పక్కలోనే పైపులు వేసి మరో అప్రోచ్‌రోడ్డు నిర్మించి ఎట్టకేలకు నీటిని విడుదల చేసింది. ఆ తర్వాత కూడా ఒక పంప్‌తోనే నీళ్ల విడుదల చేసింది. రైతులు, రాజకీయపార్టీల నుంచి ఒత్తిడి పెరగడంతో కొత్తగా నిర్మించిన వంతెనపై రాకపోకలను అనుమతించి కాలువలోని పూడికను పూర్తిగా తీసేశారు. ఇక హంద్రీ–నీవా పంప్‌లను ఎక్కువ సంఖ్యలో ఆన్ చేసి నీళ్ల విడుదల చేస్తే 'సీమ'కు మేలు జరుగుతుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సుల్లో పాల్గొన్న నంద్యాల, కర్నూలు జిల్లా కలెక్టర్లు రాజకుమారి, పి.రంజిత్‌బాషా

-కర్నూలు(సెంట్రల్)

మద్రాస్ కాల్వకు 5 వేల క్యూసెక్కులు

వెలుగోడు: తెలుగు గంగలో అంతర్భాగమైన మద్రాస్ కాల్వకు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. సోమవారం బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ మీదుగా 16,700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో మద్రాస్ కాల్వకు 5 వేలు, వన్ ఆర్ తూముకు 50, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం వీబీఆర్‌లో 10.623 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పంపుహౌస్‌లో దొంగలు పడ్డారు!

- రూ.12 లక్షలు విలువజేసే సామగ్రి ధ్వంసం
- విలువైన ఆరు కాపర్ షీట్ల చోరీ


దుండగుల చేతిలో ధ్వంసమైన స్టార్టర్లు


కాపర్ షీట్లను ఎత్తుకెళ్లిన దృశ్యం

మంత్రాలయం: గురురాఘవేంద్ర ప్రాజెక్టు(జీఆర్పీ) ఎత్తిపోతల పథకాల పంపుహౌస్‌ల్లో దుండగులు విధ్వంసాలు చేస్తూనే ఉన్నారు. పంపుహౌస్‌లోని స్టార్టర్లు, మోటార్లు, ఫీడర్లను నాశనం చేస్తున్నారు. అందులో లక్షలు విలువజేసే కాపర్‌ను ఎత్తుకెళ్తున్నారు. రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారు. వారం క్రితం మాధవరం ఎత్తిపోతల పథకం స్టేజ్–1 పంపుహౌస్‌లో చొరబడి రూ.9.50 లక్షల విలువజేసే కాపర్ షీట్లను చోరీ చేశారు. అంతేగాక రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్, స్టార్టర్లు, బ్రేకర్స్, బ్యాటరీలు ధ్వంసం చేయడంతో రూ.1.40 కోట్లు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. తాజాగా ఆదివారం రాత్రి జీఆర్పీ పరిధిలోని బసలదొడ్డి స్టేజ్–1 పంపుహౌస్‌లోనూ చొరబడ్డారు. ముందుగా పంపుహౌస్ ఫీడర్‌ను ధ్వంసం చేశారు. షెట్టర్‌ను గడ్డపారలతో పగులగొట్టి పంపుహౌస్‌లో దూరారు. అందులో స్టార్టర్లను పగులగొట్టి అందులో ఆరు కాపర్ షీట్లను ఎత్తుకెళ్లారు. అలాగే బ్యాటరీలను సైతం తీసుకెళ్లారు. దుండగుల దుశ్చర్యతో రూ.12 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఏఈ హరిప్రసాద్ తెలిపారు.

దుండగుల పరారీ..?

ఇటీవల మాధవరం స్టేజ్–1 పంపుహౌస్‌లో దుండగులు విధ్వంసం సృష్టించడంతో మాధవరం ఎస్‌ఐ కృష్ణమూర్తి నేతృత్వంలో ఆదివారం రాత్రి పోలీసులు గస్తీ తిరిగారు. రాత్రి 12 గంటల సమయంలో రచ్చమర్రి ఆదర్శపాఠశాల సమీపంలోని బసలదొడ్డి స్టేజ్–2 పంపుహౌస్‌ను తనిఖీ చేశారు. తిరిగి వస్తూ సైరన్ కొట్టుకుంటూ మాధవరం గ్రామ సమీపంలోని నదీతీరం వైపు వెళ్లారు. తుంగభద్ర నదీతీరంలో ఉన్న మాధవరం స్టేజ్–1, బసలదొడ్డి స్టేజ్–1 పంపుహౌస్‌ల వైపు జీపును పోనిచ్చారు. ముందే పసిగట్టిన దుండగులు అందినకాడికి కాపర్ షీట్లను ఎత్తుకెళ్లి పరారయ్యారు. రాత్రి పోలీసులు అక్కడికి వెళ్లి ధ్వంసమైన స్టార్టర్లు గమనించి గస్తీ కాశారు. ఉదయం జీఆర్పీ అధికారులకు సమాచారం ఇవ్వగా ఏఈ హరిప్రసాద్ అక్కడకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. దుండగుల దాడితో నాశనమైన పరికరాలు, ఎత్తుకెళ్లిన కాపర్‌షీట్ల వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఈ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

శక్తినగర్ దుండగుల పనేనా..!

విధ్వంసాలపై ఇన్నాళ్లు పోలీసులు రాజకీయం కోణంలో విచారణ చేశారు. అయితే బసలదొడ్డి పంపుహౌస్ దాడుల్లో కర్ణాటకలోని రాయచూరు జిల్లా శక్తినగర్ దుండగులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం బసలదొడ్డి పంపుహౌస్‌తో దుండగులు నాలుగు ఎగ్‌రైస్ ప్యాకెట్లు తెచ్చుకున్నారు. అక్కడే ఓ వ్యక్తి చొక్కాను కూడా వదిలేసి పరారయ్యారు. చొక్కా కాలర్‌పై శక్తినగర్ టైలర్ లేబుల్ ఉన్నట్లు గుర్తించారు. ఇదంతా శక్తినగర్ వాసులు చేస్తున్నట్లు అనుమానులు వ్యక్తమవుతున్నాయి. ఎగ్‌రైస్ పార్సల్‌ను బట్టి నలుగురు వ్యక్తులు దాడిలో ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

ఎవరి కమిటీలు వాళ్లవి!

- నీటి సంఘం కమిటీ ఎన్నికల 'రాజకీయం'

పగిడ్యాల: పోలీస్ బందోబస్తు మధ్య మల్యాల ఎత్తిపోతల పథకం ఫేజ్–1 నీటి సంఘం కమిటీని ఎంపీ వర్గం తరఫున మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. సోమవారం సాయంత్రం లక్ష్మాపురం అంచె వద్ద గల జమ్ములమ్మ గుడి ఆవరణలో మాజీ ఎమ్మెల్యే రైతులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి మైనర్ ఇరిగేషన్ డీఈ నాగార్జున, ఏఈ నారాయణరెడ్డి హాజరయ్యారు. అనంతరం కమిటీ ప్రెసిడెంట్‌గా బీరవోలు జయరాముడు, వైస్ ప్రెసిడెంట్‌గా బాదర్ల రంగస్వామి(కొణిదేల), కోశాధికారిగా సురేష్‌రెడ్డి(లక్ష్మాపురం), జాయింట్ కార్యదర్శిగా వీరుతో పాటు మరో 11 మందిని సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఇదిలా ఉండగా గత నెల 31న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గం నుంచి కమిటీని ఎన్నుకున్న సంగతి తెలిసిందే. అయితే అధికారులు ఏ వర్గానికి ప్రాధాన్యత ఇస్తారోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ కర్నూలు–నంద్యాల రోడ్, రాగమయూరి ప్రక్కన 30x45 సైజులో ఇల్లు కట్టించి ఇవ్వబడును. మరియు ఓర్వకల్లు, తిప్పాయిపల్లి రోడ్‌లో నూతన వెంచర్‌లో తక్కువ ధరకు ప్లాట్లు కలవు. ✆ 9963800314. [L-796509]

PLOT FOR SALE

■ సులభవాయిదాలలో శశికాంత్ టౌన్ షిప్ నందు ప్లాట్ నెం. 55,56 (6 సెంట్లు), సల్కాపురము వద్ద మెయిన్ రోడ్డుకి 8.5 సెంట్లు అమ్మబడును. ఫోన్: 8977209682 [HA-796614]

SERVICES

FOR SALE

■ V-Spa హెయిర్ కటింగ్ షాప్ లీజుకు గాని/ అమ్మకానికి ఇవ్వబడును. అడ్రస్: షాప్.నెం: 7, 1వ ఫ్లోర్, హాజీ గులామ్ హుస్సేన్ కాంప్లెక్స్, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్స్, కర్నూలు. ✆ 9966274426. [L-796506]

WANTED

■ కర్నూలు నగరం సంతోష్ నగర్‌లోని ప్రముఖ కార్ షోరూం నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గంటల డ్యూటీ, జీతం: 12,000+ESI, PF. సం.ప్ర: 9182964173. [L-796430]

■ WORK FROM HOME: APTS NEWS యాప్‌లో వర్క్ ఫ్రం హోమ్ జాబ్స్ ఫ్రీగా ట్రైనింగ్ ఇచ్చి జాబ్ ఇస్తాం. Female Telecallers కావలెను. జీతం: 15వేలు పైన. ఫోన్: 9966676646. [L-796422]

■ Wanted Marketing Executives, Fluency in English & Telugu, Qly: INTER, Attractive Salary+Incentives, Electrocare Solutions, Bhagirathi Complex, Park Road, Kurnool. Cont: 7330944972, 7330944872. [L-796505]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185276]

■ Good Opportunity for managers in Naturals salon, Kurnool Contact : 9177155499. [C-799953]

■ కస్టమర్స్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను జీ:15 వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph: 8317512135 [HA-98107]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796263]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165

తప్పుల భయంతోనే తప్పుకున్నారు!

- డీసీసీబీ మాజీ సీఈఓపై విమర్శల వెల్లువ
- 2017లో ఖాళీల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌కు తూట్లు



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకుకు కొద్ది నెలల క్రితం వరకు ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన వ్యక్తిని బయటికి పంపడానికి ఎవరూ పొగపెట్టలేదు. ఆయన చేసిన తప్పులు రానున్న రోజుల్లో మెడకు చుట్టుకునే ప్రమాదం ఉందని ఊహించే రాజీనామా చేసి తప్పుకున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇటీవల ఒక పత్రికలో 'ఆదాయం మింగి.. అప్పు మిగిల్చారు' శీర్షికపై వచ్చిన కథనంలో కక్ష కట్టి సీఈఓకు పొగ అంటూ రాయడం పట్ల అసంతృప్తి వ్యక్తం అవుతోంది. 2024 జూన్ నెల మొదటి వారం వరకు డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి.. సీఈఓ చేసిన తప్పులను ఆధారాలతో సహా వెలికి తీసి, ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనిని పసిగట్టి సీఈఓ పదవిలో కొనసాగితే రానున్న రోజుల్లో ఇబ్బందులు తప్పవనే భయంతోనే రాజీనామా చేసి తప్పుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తప్పిదాలు మచ్చుకు కొన్ని...

➡ 2017జూలై 15న టీడీపీ ప్రభుత్వ హయాంలో డీసీసీబీలో డైరెక్ట్ రిక్రూట్ ద్వారా 48 పోస్టులు, ఇన్ సర్వీస్ ద్వారా 14 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. డైరెక్ట్ రిక్రూట్ ద్వారా వచ్చిన 48 మందిలో ఒకరు ఉద్యోగం వదులు కొని వెళ్లారు. ఖాళీ అయిన పోస్టులో ఇదే కేటగిరిలోని వెయిటింగ్ లిస్టులో మెరిట్‌లో ఉన్న వారితో భర్తీ చేయాల్సి ఉంది. ఇలా చేయకుండా ఇన్–సర్వీస్‌లో ఉన్న వారిలో ఒకరిని మెరిట్ లేకపోయినా తీసుకోవడం విమర్శలకు కారణమైంది. 14 పోస్టులను ఇన్ సర్వీస్ వారితో భర్తీ చేసిన తర్వాత 15, 16 సీరియల్ నెంబర్లలో ఉన్న వారిని పట్టించుకోకుండా 17వ నెంబరులో ఉన్న వారితో భర్తీ చేయడం నిబంధనలను ఉల్లంఘించడమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏ కేటగిరిలో పోస్టు ఖాళీ అయితే అదే కేటగిరిలోని వారితోనే భర్తీ చేయాల్సి ఉండగా.. ఇన్ సర్వీస్ వారితో భర్తీ చేయడాన్ని ఇటీవలి వరకు చైర్మన్‌గా పనిచేసిన ఎస్‌వి విజయమనోహరి ఆప్కాబ్ ఎండీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

➡ డీసీసీబీలో మేనేజర్‌గా పనిచేసిన రామచంద్రారెడ్డి 2022 డిసెంబరు 31న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా 2023 జూలై వరకు ఉద్యోగంలో ఉండి జీతభత్యాలు పొందారు. పీఎఫ్ అధికారులు కొనుగొని సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో అప్పటికప్పుడు పదవీ విరమణ చే యించారు. సీఈఓ పర్యవేక్షణ లోపం వల్లనే పదవీ విరమణ చేసినా ఆరు నెలలు కొనసాగి వేతనాలు పొందారు. నోటిఫికేషన్ ఉల్లంఘించినా... పోస్టుల భర్తీలో కీలకంగా వ్యవహరించిన ఇనిస్టిట్యూట్ అఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్ ఏజెన్సీ(ఐబీపీఎస్) ప్రేక్షక పాత్ర వహించిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

➡ ఆదోని ప్రాంతంలో 2015లో మరణించిన ఒక వ్యక్తికి 2018లో కర్షక జ్యోతి పథకం కింద రూ.15 లక్షలు రుణం మంజూరు చేయడం అప్పట్లో కలకలం రేపింది. అంతేగాక రెన్యువల్ కూడా చేయడం మరో తప్పిదం. చనిపోయిన వ్యక్తికి రుణం ఇవ్వడానికి సీఈఓతో పాటు అప్పటి చైర్‌పర్సన్ కూడా ఎండార్స్‌మెంటు ఇచ్చారు. డీజీఎం నాగిరెడ్డి ఫీల్డ్ వెరిఫికేషన్‌కు వెళ్లి భూమిని మాత్రమే ధ్రువీకరించారు. రైతుతో మాట్లాడాలని డీజీఎం నాగిరెడ్డి సంబంధిత బ్యాంకు మేనేజర్‌ను అడిగితే ఆయన బంధువు మరణించి ఉండటం వల్ల వేరే గ్రామానికి వెళ్లారని తప్పుదోవ పట్టించారని తెలుస్తోంది. ఈ తప్పిదంలో రాజీనామా చేసిన సీఇవో పాత్ర ఉందని స్పష్టమవుతోంది.

➡ డీసీసీబీలో ఎన్‌పీఏ కొండలా పెరిగిపోయిందనే విమర్శల్లో వాస్తవం లేదు. ఇంకా రికవరీకి సమయం ఉంది. రికవరీ చేయాల్సిన బాధ్యత సీఈఓ, బ్యాంకు అధికారులపై ఉంది. రికవరీలో నిర్లక్ష్యం వహించడం ద్వారా ఎన్‌పీఏ పెరిగితే చైర్‌పర్సన్ ఎలా బాధ్యులవుతారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

చాలా ఫిర్యాదులు ఉన్నాయి

డీసీసీబీ సీఈఓకు పొగపెట్టి బయటికి పంపారనే విమర్శల్లో ఎలాంటి వాస్తవం లేదు. మేం చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన 10 రోజులకే రాజీనామా చేస్తామని వచ్చారు. మేం అంగీకరించలేదు. మళ్లీ కొన్నాళ్లకు వచ్చి వ్యక్తిగత సమస్యలతో రాజీనామా చేస్తున్నానని, ఆమోదించాలని కోరారు. అప్పటికి ఆమోదించలేదు. కొన్నాళ్లు పెండింగ్‌లో పెట్టాం. ఒత్తిడి చేయడంతో రాజీనామాను ఆమోదించాం. సీఈఓపై చాలా ఫిర్యాదులు ఉన్నాయి. బూతు మాటలతో వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని అప్పట్లో ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశాము. కర్నూలు నగరంలో 1000 జేఎల్‌జీ గ్రూపులకు రుణాలు ఇచ్చేందుకు ప్రయత్నించాం. అయితే నాబార్డు నుంచి అనుమతి రావడానికి ఆలస్యమైంది. ఆ లోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయింది. సీఈఓపై ఉన్న ఫిర్యాదులు మెడకు చుట్టుకుంటాయనే భయంతోనే రాజీనామా చేసినట్లు మాకు సమాచారం ఉంది.

– ఎస్వీ విజయమనోహరి, మాజీ చైర్‌పర్సన్, డీసీసీబీ

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు


మల్లన్న దర్శనానికి బారులుదీరిన భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన పరమేశ్వరుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం భోళాశంకరుడికి ప్రీతికరమైన రోజు కావడం, శ్రీశైలం డ్యాం క్రస్ట్‌గేట్లను తెరచి దిగువ సాగర్‌కు నీటిని విడుదల చేస్తుండడంతో కృష్ణమ్మ అందాలను కనులారా చూసేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 4 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్ని కిటకిటలాడాయి. మల్లన్న దర్శనం అనంతరం క్షేత్ర పరిధిలోని ఉపాలయాలు, శ్రీశైలంప్రాజెక్టును సందర్శిస్తూ..కృష్ణమ్మ చెంత నుంచి సాగర్ వైపు పరుగులు పెడుతున్న దృశ్యాలను చూస్తు గాధ్యాత్మిక అనుభూతితో పాటు పర్యాటక అనుభూతిని పొందుతున్నారు.